ఆగని వన్యప్రాణుల వేట




వేటగాళ్ల ఉచ్చులో పడిన దుప్పి (ఫైల్), (ఇన్‌సెట్) వేటగాళ్లు అమర్చిన నాటు బాంబు (ఫైల్)

అధికారుల నిర్లక్ష్యం వేటగాళ్లకు బాగా కలిసొస్తోంది. కౌండిన్య అడవిలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. అడవిలో ఎటుచూసినా వన్యప్రాణుల కోసం అమర్చిన ఉచ్చులు, నల్లమందు ఉంటలు దర్శనమిస్తున్నాయి. వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని మూడోకంటికి తెలియకుండా విక్రయిస్తున్నారు. ముఖ్యంగా దుప్పులు, జింకలు, కుందేళ్లు, అడవి పందులు, కౌముజు పిట్టల మాంసాన్ని డోర్ డెలివరీ సైతం చేస్తున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఎటు చూసినా ఉచ్చులు, నల్లమందు ఉంటలు
- గుట్టుచప్పుడు కాకుండా మాంసం విక్రయాలు
- మొత్తం సెల్‌ఫోన్లతోనే వ్యాపారం

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పలమనేరు మండలం నుంచి బైరెడ్డిపల్లె, వి.కోట మండలం వరకు కౌండిన్య అభయారణ్యం విస్తరించి వుంది. ఈ ప్రాంతానికి దక్షిణంగా తమిళనాడులోని మోర్ధన అటవీ ప్రాంతం ఉంది. ఈ అడవిలో ఏనుగులతో పాటు వేల సంఖ్యలో దుప్పులు, జింకలు, అడవి పందులు, కుందేళ్లు తదితర వన్యప్రాణులు వున్నాయి. ఈ అడవికి ఆనుకుని దాదాపు 60 గ్రామాలున్నాయి. వీటిలోని కొందరు నిత్యం అడవిలో వేటాడడం జీవనోపాధిగా మార్చుకున్నారు.



ఊసరపెంట సమీపంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులు

ఇందుకోసం నాటు బాంబులను తయారుచేసి వాటిపై వన్యప్రాణులకు ఇష్టమైన పదార్థాలను ఉంచి అడవిలో పెట్టి వస్తున్నారు. వాటిని తిన్న జంతువులు మందుగుండు పేలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. ఇలా చనిపోయిన వాటిని మరుసటి రోజు వెళ్లి తీసుకుని వచ్చి విక్రయిస్తున్నారు. అదేవిధంగా కమ్మీలు, వైర్లతో తయారు చేసిన ఉచ్చులను పగటి పూట అడవిలో చెట్ల మధ్య అమరుస్తున్నారు. వాటిలో జంతువులు ఇరుక్కుంటే అక్కడే చంపి మాంసాన్ని తీసుకువస్తున్నారు. ఈ వేటగాళ్ల కారణంగా ఊరకుక్కలు, అడవిలో మేతకు వెళ్లే పశువులు, మేకలు తరచూ బలవుతూనే ఉన్నాయి.

కుంకీ ఏనుగుల సంరక్షణలో అటవీ సిబ్బంది

పలమనేరు మండలం ముసలిమొడుగు వద్ద ఇటీవల కుంకీ ఏనుగుల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇక్కడ ఏడు ఏనుగులున్నాయి. వీటి సంరక్షణ కోసం ఎక్కువమంది ఫారెస్ట్ సిబ్బంది అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్వోలు, ఏబీవోలు తమ బీట్లను పక్కనబెట్టి కుంకీ ఏనుగుల పనిలో పడ్డారు. ఇదే వేటగాళ్లకు అదనుగా మారింది. అడవిలోకి ఫారెస్ట్ సిబ్బంది పెద్దగా రాకపోవడంతో నల్లమందు ఉంటలు, కమ్మీ ఉర్లు వేస్తున్నారు.

సెల్‌ఫోన్లలోనే వ్యాపారాలు

అడవి జంతువుల మాంసం విక్రయాలు సెల్‌ఫోన్లలోనే సాగుతోంది. కొంతమంది ఇళ్లవద్దకే తెచ్చి ఇస్తున్నారు. వన్యప్రాణులను బట్టి మాంసం కిలో రూ.300 నుంచి రూ.400 వరకు ఉన్నట్లు సమాచారం. స్థానిక మార్కెట్‌లో పొట్టేలు మాంసం రూ.800 వరకు ఉంది. దీనికంటే అడవి జంతువుల మాంసం ధర తక్కువగా వుండడంతో ఎక్కువ మంది కొంటున్నట్లు తెలిసింది.

వేట సాగుతుంటే సమాచారం ఇవ్వండి

కౌండిన్య అడవిలో వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడుతున్నట్టు తెలిస్తే మాకు సమాచారం ఇవ్వండి. వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం. వేటగాళ్లపై చర్యలు తీసుకుంటాం. అందేవిధంగా మా సిబ్బందితో కూడా సమావేశం ఏర్పాటుచేసి వన్యప్రాణుల వేటపై చర్చిస్తాం. దీనిపై కిందిస్థాయి అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేస్తాం.

– నారాయణ, ఎఫ్ఆర్వో, పలమనేరు

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తి ఆరీఫాషేక్

పుంగనూరు: డబ్బు, సమయాన్ని వృథా చేసుకోకుండా మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆరీఫాషేక్ తెలిపారు. ఆమె బుధవారం కోర్టు ప్రాంగణం నుంచి గోకుల్ సర్కిల్ వరకు న్యాయవాదులు, సిబ్బందితో కలిసి దేశం కోసం మధ్యర్తిత్వం అన్న అంశంపై ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వివాహ, చెక్కు బౌన్స్, రోడ్డు ప్రమాదాలు, గృహ హింస కేసులు, వాణిజ్య సంబంధ వివాదాలను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ప్రజలు, న్యాయవాదులు, అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోర్టుల న్యాయాధికారి ప్రేమవాణి, న్యాయవాదులు బాలాజికుమార్, మల్లికార్జునరెడ్డి, విజయభాస్కర్, సురేష్, రమేష్, రమణ, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.10 వేల విరాళం

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన మోడల్ ప్రైమరీ పాఠశాలకు పీలేరుకు చెందిన సుమలత రూ.10 వేలు విరాళం ఇచ్చినట్టు హెచ్ఎం గుణశేఖర్ తెలిపారు. ఆ మొత్తంతో విద్యార్థులకు అవసరమైన బోధన సామగ్రి తీసుకుంటామని పేర్కొన్నారు. దాతను ఉపాధ్యాయులు, పిల్లల తల్లితండ్రులు అభినందించారు.

క్లుప్తంగా

జగన్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



పలమనేరు: మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రాజకీయ పరిస్థితులను ఆయనకు వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె హైస్కూల్లో పనిచేస్తూ ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు సిద్దరామయ్య, పోకల తాతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు అర్జున తపస్మాన్

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం అర్జున తపస్మాన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అల్లాబక్ష్‌కు పరామర్శ



అల్లాబక్ష్‌తో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి

రొంపిచెర్ల: అనారోగ్యంతో బాధ పడుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత అల్లాబక్ష్‌ను బుధవారం జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఆయన పది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ వీధిలోని ఇంటిలో వున్నారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కరీముల్లా, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు

పుంగనూరు: పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ అడ్మినిస్ట్రేటర్ రమ్య, కోఆర్డినేటర్ శశికళ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరికిదొనలో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

చౌడేపల్లె: పశువులకు లంపీ స్కిన్ (ముద్దచర్మ వ్యాధి) వ్యాధి సోకకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి పవన్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం పరికిదొనలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు బ్యూటాక్స్ పిచికారీ చేశారు. గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న పశువులకు చికిత్స చేశారు. ఆయన మాట్లాడుతూ దోమకాటుతోనే పశువులకు ముద్ద చర్మవ్యాధి సోకుతుందన్నారు. పశువుల పాకలో వేపాకు పొగవేయడం వల్ల దోమల నుంచి రక్షించుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలున్న గేదెలు, ఆవులకు అధిక జ్వరం వస్తుందని, మేత తినవని, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని వివరించారు. లింపు గ్రంథుల వాపుతోపాటు కళ్ల నుంచి నీరు కారుతుందని, పశువుల శరీరంపై బుడిపెలు ఏర్పడతాయన్నారు. అవి పగిలి రక్తం కారి మరణాలు సంభవిస్తాయన్నారు. ప్రభుత్వం ఉచితంగా ముద్ద చర్మ వ్యాధి నివారణకు టీకాలు వేస్తోందని పేర్కొన్నారు.

ఘనంగా గంగజాతర



దీపాలు తీసుకెళ్తున్న మహిళలు

పుంగనూరు: మండలంలోని మంగళం గ్రామంలో బుధవారం గంగ జాతరను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు దీపాలు తీసుకుని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారి ఎదుట వెలిగించి మొక్కులు చెల్లించారు. వర్షాలు కురవాలని, పంటలు సక్రమంగా పండి అందరూ సుభిక్షంగా ఉండేలా చూడాలని గంగమ్మను ప్రార్థించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు




సదుంలో తనిఖీలు చేస్తున్న అధికారులు, పుంగనూరులో మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

సదుం: మండల కేంద్రమైన సదుంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాల్లో బుధవారం విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. స్టాకు వివరాలు, బిల్లు బుక్కులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తనిఖీ ప్రత్యేక అధికారి, అగ్రికల్చర్ ఏడీ ధనుంజయ రెడ్డి, విజిలెన్స్ సీఐ రవి, ఏవో జ్యోత్స్న, ఏఈవో ఖాదర్‌వలి పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై బుధవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవి, తిరుపతి వ్యవసాయశాఖ సంచాలకులు ధనుంజయరెడ్డి, స్థానిక వ్యవసాయాధికారులు రాధా, జ్యోతమ్మ దాడులు చేశారు. స్టాక్, బిల్లులు, ధరల పట్టికలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఎరువులు, మందులు, విత్తనాలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించినా, బిల్లులు ఇవ్వకపోయినా, కృత్రిమ కొరత సృష్టించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు దుకాణాల్లో శాంపుల్స్ సేకరించి పరీక్షలకు పంపారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి



మాట్లాడుతున్న పలమనేరు డీఎస్పీ ప్రభాకర్

చౌడేపల్లె: పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ ఆదేశించారు. ఆయన బుధవారం చౌడేపల్లె సర్కిల్ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో క్రైమ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి న్యాయం చేయడానికి కృషి చేయాలన్నారు. పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్, పట్టపగలే చోరీలు జరుగుతున్నాయని, ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసులను ఛేదించాలన్నారు. సైబర్ క్రైమ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మహిళలపై జరుగుతున్న దాడుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌లో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అనంతరం సర్కిల్ కార్యాలయాల వారిగా కేసుల పురోగతిపై సమీక్షించారు. సమావేశంలో సీఐలు రాంభూపాల్, సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చెదలు పట్టిన విద్యార్థుల రికార్డులు



చారాల ఉన్నత పాఠశాలలో చిత్తుకాగితాలను తలపిస్తున్న అడ్మిషన్ రిజిస్టర్

చౌడేపల్లె: ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్థులకు సంబంధించిన అడ్మిషన్ రికార్డులకు చెదలుపట్టిన విషయం చారాల ఉన్నత పాఠశాలలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పెద్దపంజాణి మండలం మల్లసముద్రం గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి 2000లో పదో తరగతి చదివాడు. అతనికి స్టడీ సర్టిఫికెట్ అవసరం ఏర్పడడంతో పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలో రికార్డులను పరిశీలించగా చెదలుపట్టి చిత్తు కాగితాలుగా మారినట్టు గుర్తించారు. చివరకు అడ్మిషన్ రిజిస్టర్‌లో శ్రీకాంత్ రెడ్డి పేరు కనిపించడంతో హెచ్ఎం రేణుక స్టడీ సర్టిఫికెట్ జారీ చేశారు. అడ్మిషన్ రికార్డులకు చెదలు పట్టడంపై హెచ్ఎం వివరణ ఇస్తూ తాను ఇటీవల పదోన్నతిపై ఈ పాఠశాలకు వచ్చానని తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు రికార్డులను సక్రమంగా భద్రపరచకపోవడంతోనే ఇలా జరిగిందని తెలిపారు. జిల్లా అధికారులతో చర్చించి జిల్లా కార్యాలయంలో ఉన్న రికార్డుల ఆధారంగా కొత్త రికార్డులను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.



పుంగనూరులో నమస్తే కార్యక్రమ ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల ర్యాలీ

పుంగనూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం పుంగనూరు పట్టణంలో నమస్తే కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఇంటా సెప్టిక్ ట్యాంకులు నిర్మించుకోవాలన్నారు. అలాగే పీపీఈ కిట్లను వినియోగించుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. అలాగే పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించేందుకు వచ్చే కార్మికులకు సహకరించాలని, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాముండేశ్వరిదేవి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరిదేవి

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 25 వరకు అమ్మవారి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు జెట్టి కులస్తులు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేస్తామని పేర్కొన్నారు. అమ్మవారిని ఊరేగిస్తామని తెలిపారు. ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని జెట్టికుల సంఘం ప్రతినిధులు కోరారు.

వరినారు కొనలను కత్తిరించి నాట్లు వేయాలి



వరి పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రావణి

రొంపిచెర్ల: రైతులు వరి నారు కొనలను కత్తిరించి నాట్లు వేయాలని మండల వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. ఆమె బుధవారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటలను ఎంపిక చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం పంటల మార్పిడి అవసరమన్నారు. ఒకే రకం పంటను సాగు చేయడం వల్ల పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. పంట మార్పిడి వలన అధిక దిగుబడి వస్తుందన్నారు. వరినారు కొనలు కత్తిరించడం వల్ల మొక్క ఎక్కువ మోసులు పెడుతుందన్నారు. అలాగే వరి పొలంలో కాలిబాటలు తీయాలన్నారు. వరి మొక్కలకు గాలి వెలుతురు బాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జి సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

పలమనేరు: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎల్ భాస్కర్ తెలిపారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి వారికి తాము ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ చేపట్టారు.



అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ఉపాధి పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి

రొంపిచెర్ల: మండలంలో ఉపాధి పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గూగుల్ లోకేషన్‌తోనే ఉపాధి పనులు మంజూరు చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకం పనులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలో పశువులకు తాగునీటి కోసం నిర్మించిన నీటి తొట్టెలకు కొళాయి కనెక్షన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటి కనెక్షన్ ఏర్పాటు చేయకపోతే బిల్లులు నిలిపివేయాలన్నారు. కూలీలు చేసిన పనులకు వారం వారం బిల్లులు చేయాలన్నారు. ఉపాధిలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో బాల మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు మురళి, మల్లికార్జున, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు మార్పులు, చేర్పుల్లో గందరగోళం

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు సకాలంలో జరగక అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాలు, మీసేవా, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సాంకేతికపరమైన సమస్యలతోనే ఆగినట్టు అధికారులు నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. సివిల్ చార్టర్ మేరకు రేషన్‌కార్డుల్లో మార్పులను అర్జీ ఇచ్చిన 21 రోజుల్లో పరిష్కరించాల్సి ఉన్నా నెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

- ఇబ్బంది పడుతున్న అర్జీదారులు
- సాంకేతిక సమస్యలంటున్న అధికారులు





ఇన్బనాథన్, తహసీల్దార్, పలమనేరు

పలమనేరు: మండలంలోని బయ్యప్పగారిపల్లెకు చెందిన శ్రీధర్ చౌదరి రేషన్ కార్డులో అతనితోపాటు తల్లి, తండ్రి, సోదరి కుటుంబ సభ్యులుగా ఉన్నారు. మూడేళ్ల క్రితం శ్రీధర్ చౌదరికి వివాహమైంది. అతని భార్య పేరును కార్డులో చేర్చాల్సి వుంది. అదేవిధంగా అతని సోదరికి ఐదేళ్ల కిందట పెళ్లి అయింది. ఆమె అత్తగారింట్లో వుంటోంది. అతని తల్లి ఆరు నెలల క్రితం మరణించింది. ఈ క్రమంలో అతను మొదట తన భార్య పేరును కార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నాడు. అందుకు అవసరమైన పత్రాలను కూడా అందజేశాడు. అధికారులు ముందుగా మృతి చెందిన తల్లి పేరు, పెళ్లి అయిన సోదరి పేరును కార్డు నుంచి డిలీట్ చేయాలని తెలిపారు. అందుకు గాను వినతి పత్రం ఇవ్వాలని సూచించారు. అతను అన్నింటికీ సరే అని చెప్పినా ప్రయోజనం లేదు. కార్డులోని వారు ఈకేవైసీని సైతం చేసుకున్నారు. వీరి సమస్య మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీనిపై అక్కడి అధికారులను సంప్రదిస్తే కొత్త రేషన్ కార్డులు వస్తేగానీ సమస్యలు పరిష్కారం కావని చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. చదువుకున్న వ్యక్తికే ఇలా కష్టాలుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నగా మారింది. పలమనేరు నియోజకవర్గంలో 48 వేల రేషన్ కార్డులు వున్నాయి. వాటిలో డిలీషన్స్, యాడింగ్ సమస్యలు 4 వేల వరకు ఉన్నాయి. ఇవి ఎన్నటికి పరిష్కారం అవుతాయనే విషయం అధికారులకే తెలియాల్సి ఉంది. ఈ విషయమై పలమనేరు తహసీల్దార్ ఇన్బనాథన్ వివరణ ఇస్తూ సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నామని తెలిపారు. బయట రాష్ట్రాల్లో ఉన్న వారి రేషన్ కార్డుదారులు, ఒకే కార్డుపై బహుళ సమస్యలు ఉన్న వారి విషయంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి లాగిన్ ద్వారా చేయిస్తున్నందున కొంత ఆలస్యం అవుతుందని చెప్పారు.